# ౪ గాడిదపిల్ల కోమలం

ఎఱుకలో ఏనాదులో ఎవళ్లైతేం మొఱకులూ మోటు వాళ్ళున్నా వాళ్ళు. వాళ్ళతో ఉండే జంతువులు పందులూ గాడిదలూ వాళ్ళ వేషాలు చూస్తే మగాళ్ళు పుట్టగోచీ పెట్టుకు తలపాగాలు చుట్టుకు రెండుచేతులా వెండిమురుగు లుంచుకుంటారు. ఒకొక్కక్క యువకుడు మెళ్లో పచ వో ఎఱ్ఱవో గాజూరాళ్ళు ధరిస్తాడు. ఆడవాళ్ళు బోరంతా కమ్ముకుపోయేటట్టు పూసలపేర్లు దిగేసుకు, భాగ్యం లేకపోయినా భాగ్యమున్నవాళ్ళల్లే నడాడుతూ వుంటారు. ఎక్కడ ? పదిపదారు చరకుటీరాలమధ్య, రోడ్డు పంచలనే, చెట్ల నీడల, కాలవపజ్జ, గలీక పచ్చ.

మనుష్యులలా వొత్తిగిలివున్నా వాళ్ళగాడిదలూ పందులూ మాత్రం రోడ్డు కడ్డంగా అస్తమానం తిరుగుతూనే వుంటాయి, ఘూర్ణిస్తూ, జీండ్రిస్తూ.

మన కథాసంధర్భాని కీతూరి పందిని వదిలేదాము. అది అవతారానికి వరహావతారమేకాని మానవుల నుడికారంలోదానికి ప్రఖ్యాతీ ప్రజ్ఞాలేవు. గాడిద అనే జంతువు అలాంటిదికాదు. అవతారాల్లో లెక్కకు రాకపోయినా పేరు ప్రతిష్ఠల్లో చాలా ఎక్కువుది. గాడిదపిల్ల కోమలం, గాడిదపిల్ల కోమలం అని పదేపదే అనడం రివాజూకూడా అయిపోయింది తెనుగు భాషలో.

అయితే ఈ ప్రఖ్యాతి కోమలత్వంచేత వచ్చిందేనా అనేది యోజించ వలసిన విషయం.

ఏపురాణస్త్రీనీ ఏకవీ యింతవరకు అరూపవతిగా వర్ణించిన జాడ లేదు. అందరినీ బహుఅందంగానే వర్ణించి యుండారు. తీసికోండి సీతను, తీసికోండి ద్రౌపదిని, తీసికోండి దమయంతిని, తీసికోండి ఇంకాఇంకా పేరెన్నికగన్న మహా మహా సాధ్వుల నందర్నీ, అందరూ కోమలాంగులే, అందరూ విరిబోళ్లే, అందరూ విరహావస్థ వచ్చేసరికి వెన్నెల్లో కరిగిపోయ్యే వెన్నపూస ముద్దలే. కాని కీర్తి అనేది వాళ్ళకు దాన్నిపట్టి రాలేదు. వాళ్ళ పాతివ్రత్యాన్నిబట్టి వచ్చింది. రావణాసురుణ్ణి గడ్డిపోచగా ఎంచి సంబోధించడంవల్ల సీతకు, దుశ్శాసనుని నెత్తురితోగాని తన కురులు ముడువనని పంతంపట్టి పంతంనెగ్గించుకున్నందుకు ద్రౌపదికి, ఎఱుకలవాణ్ణి అమాంతంగా దగ్ధము చేసివేసినదగుటచే దమయంతికి యశస్సు చేకూడింది.

గాడిదపిల్ల కోమలం కోమలం అన్నాఅంతే: దాని పాతివ్రత్యాన్ని గురించి కొంచెం వ్రాస్తాను. కాదనేవాళ్ళు ఎవరైనావుండి, లేదు, తాపు లేనిపిల్ల, మెత్తనిపిల్ల, వశీకరమయ్యేపిల్ల, కాబట్టే దానికీకీర్తి అని అనే వాళ్ళు ఎవరైనావుండి వాదనకు దిగుతారా దిగండి.

మోటారుబస్సు రంయిని పెడుతూవుంది. పట్టపగలు ముందు బాటనే అరడజను గాడిదలు, అడ్డవి, కుట్టివి, బుల్లివి, ఉన్నాయి. అడ్డ వేమో అంతదూరాన్నే మోటారుబస్సు హైర్ల చప్పుడుకే తప్పుకున్నాయి. బుల్లివేమో బూరా బంయి మనడంతోనే పారిపోయాయి. కుట్టివి అలా బాటమ్మటే వెట్టిగా నిల్చిపోయినాయి. అన్నీ మూడు గాడిదలు కుట్టి

గాడిదలు. ఆమూడింటల్లో మళ్లీ రెండు బస్సు బాగాదగ్గఱకు వచ్చిందన్నాక ఇలా బాటనుంటే ప్రయోజనం లేదన్నట్లు వెళ్ళిపోయినయి. ఒకటి మాత్రం అతికోమలమైంది, తన్నేచూడమన్నట్టు అలా వుంది. డ్రైవరు పూర్తిగా బ్రేకు వేయకుండా స్పీడ్ మాత్రం బాగాతగ్గించి అది తప్పుకోక పోతుందా అన్నట్టు, దానితో చెరలాటం ఆడుతొన్నట్టు గజం గజన్నరలో మోటారు నడుపుతున్నాడు.

ఆగాడిదపిల్ల ఏమన్నాగానీ తప్పుకోమన్నాగానీ మోటారుముందే వుంటానన్నట్టు అలాగ్గావుండిపోయి, యంత్రంముందు కడ్డీలకు తోకతగిల్చినంత దగ్గరగా అయిపోయింది. డ్రైవరు "అబ్బా! చచ్చిపోతుందో ఏమో, గాడిదపిల్ల కోమలం అంటారు. ఏమిటబ్బా చచ్చిపోతుందేమో" అని ప్యాసింజర్లు అనుకునేటట్టు మటీ మెల్లి మెల్లిగా పోనిస్తున్నాడు గాడీ దిగకుండనే "ఉస్ ఉస్" అంటూ "వ్వా" చేసీవాడికిమల్లే.

"ఈః డ్రైవర్లు మిక్కిలీ కోమలమైన శరీరాలమీదికి లక్షొతొంభై సార్లు బళ్ళల్లో కూర్చున్నవాళ్ళ మీదకు అర్ధరాత్రప్పుడు మోటారులైట్లు గమ్మనవేసి ఆ శరీరాలు నవ్వుతూంటే ఆనవ్వే తెల్లటిపళ్ళయొక్క తేజస్సును చూరగొనే మహానుభావులు కాదండీ" అని అన్నట్టు గాడిదపిల్ల ఉన్నట్టుండి వెనకాల్కాలితో ఒక్కతాపు మోటారులైటును తన్ని ఉడాయించి పక్కకు పోయింది.

లైటు ముక్కముక్కలై పోయింది. మోటారుడ్రైవరు నాలిక్కరచుకుని "అరే భాంఛోత్! గాడిదపిల్ల కోమలం అంటారు కాదువోయి" అన్నాడు. కండక్టరు ముందుకొచ్చి చూస్తూ "ఏంబాబా! అలాఅని పగలు కూడా లైటువేసి సైటు కొడుతున్నావా ఏంటి! లైటు పప్పు పప్పు అయి

పోయింది" అని అన్నాడు. "పతివ్రత ఎవరో పతివ్రత కానివా రెవరో కొంచెం నిదానిస్తూవుండు" అనికూడా హెచ్చరించేడు.

"సైటు వేయకుండానే నాకళ్ళు అంధకారం చేసి పారేసింది. సైటు వేసివుంటే నా గుడ్లుకూడా పేలిపోయి యుండేది. గాడిదపిల్ల కోమలం కాదుటే! బలేపతివ్రత!" అన్నాడు డ్రైవరు లైటుయొక్క పగిలిపోయిన అద్దమ్ముక్కలు తీసి దూరంగా విసిరేస్తూ.

గాడిదపిల్ల కోమలం అంటే ప్రఖ్యాతి అది!

---

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 24—10—1934 | కానూరుప్రాంతం | "వినోదిని" లో |